సాక్షి
అనకాపల్లి
శనివారం । 12 । జులై । 2025

పరిశ్రమల్లో భద్రత డొల్ల

- ఫార్మా కార్మికుల ప్రాణాలకేదీ రక్షణ?
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తరచూ ప్రమాదాలు
- రెండు వారాల క్రితం పరవాడ ఎస్ఎస్ ఫార్మాలో ప్రమాదం
- మూడు రోజుల క్రితం లూపిన్ కంపెనీలో ఘటన
- గుట్టుచప్పుడు కాకుండా దాచిన యాజమాన్యం



లూఫిన్ ఫార్మా పరిశ్రమ

సాక్షి, అనకాపల్లి: పరవాడ సెజ్‌లో పలు ఫార్మా కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు కొరవడ్డాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగి కొంతమంది కార్మికులు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాలు సంభవించినా అధికారుల సహకారంతో యాజమాన్యాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఈనెల 8న పరవాడ జేఎస్ ఫార్మాలో ఉన్న లూపిన్ పరిశ్రమలో ప్రమాదం జరిగింది. ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. వారిలో పి.లక్ష్మణ్‌కుమార్ అనే కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదం బయటకు పొక్కకుండా కంపెనీ యాజమాన్యం దాచిపెట్టింది.

ప్రశ్నార్థకంగా కార్మికుల భద్రత

'పరవాడ-అచ్యుతాపురం' స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో ఫార్మా పరిశ్రమల్లో తరుచూ ప్రమాదాల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలు ఏమాత్రం పాటించడం లేదు. సాహితీ, ఎసెన్షియా, జేఎస్ ఫార్మాసిటీలో సినర్జిన్, ఎస్ఎస్ ఫార్మా, రెండు రోజుల క్రితం లూఫిన్ ఫార్మా కంపెనీ.. ఇలా వరుస ప్రమాదాలు కార్మికుల కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప అధికార యంత్రాంగం పరిశ్రమల్లో భద్రతపై దృష్టి పెట్టిన దాఖలా లేదు. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో 130కి పైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. పలు కంపెనీలు భద్రతా ప్రమాణాలను పాటించడం లేదు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సెజ్, నాన్ సెజ్ పరిధిలో 19 అత్యంత ప్రమాదకర పరిశ్రమలు ఉండగా..192 ప్రమాదకరమైన పరిశ్రమలు, 56 రెడ్ కేటగిరీ పరిశ్రమలు, 82 ఫార్మా సిటీలో ఔషధ పరిశ్రమలున్నాయి. ఈ కంపెనీల్లో దాదాపుగా 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫార్మా కంపెనీల్లో 10కు పైగా ప్రమాదాలు జరిగాయి. వేర్వేరు ప్రమాదాల్లో ఇప్పటి వరకు 40 మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు మృతి చెందారు. 120 మందికిపైగా క్షతగాత్రులుగా మారారు.

మరుసటి రోజు తెలిసింది

లూపిన్ ఫార్మా ప్రమాదం గురించి ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ వివరణ కోరగా.. తమకు ఈ ప్రమాదం జరిగిన మరుసటి రోజు సమాచారం వచ్చిందని చెప్పారు. పోలీసులతో కలిసి ఈ ఘటనపై ఆరా తీశామన్నారు. ప్రస్తుతం లూపిన్ ఫార్మాలో అస్వస్థతకు గురైన కార్మికుడు కిమ్స్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

మొక్కుబడిగా తనిఖీలు

ఈ ప్రమాదాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగు పర్యాయాలు తనిఖీలు చేయాల్సి ఉన్నా ఆ విధంగా జరగడం లేదు. నిపుణులైన ఉద్యోగులు అధిక ఉష్ణోగ్రత కారణంగా రియాక్టర్లు పేలిపోకుండా, ఇతరత్రా అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఫార్మా కంపెనీల్లో నిపుణులులేకపోవడం వల్లే తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టీడీఆర్ బాండ్లు వద్దు.. పరిహారంపై మాట మార్చొద్దు



పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని 24 గంటల దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు


దీక్షా శిబిరంలోనే నిద్రించిన సీపీఎం నేతలు

- నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు రాజీ లేని పోరాటం
- పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి
- మునగపాకలో 24 గంటల దీక్షకు దిగిన సీపీఎం నేతలు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్ బాండ్లు కట్టబెట్టవద్దని, ఇచ్చిన మాట ప్రకారం పరిహారం నగదు రూపంలో అందించాలన్న ఉద్యమం ఉధృతమైంది. ఈ డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మునగపాకలో 24 గంటల నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తామంటూ ఇచ్చిన హామీలో భాగంగా బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. బాధితులకు నష్టపరిహారాన్ని నేరుగా నగదు రూపంలో అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు మాట మార్చి టీడీఆర్ బాండ్లు ఇస్తామంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాము అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని.. అయితే అధికారులు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనన్నారు. 2013 భూ సేకరణ చట్టప్రకారం మెరుగైన పరిహారం అందించాలన్నారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నగదుతోపాటు ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు కల్పించాలన్నారు. 24 గంటల దీక్షలో సీపీఎం నేతలు గనిశెట్టి సత్యనారాయణ, సదాశివరావు, కర్రి అప్పారావు, కాండ్రేగుల ఆదిబాబు, దాడి శ్రీరామమూర్తి, రొంగలి రాము, ఎస్.బ్రహ్మాజీ, శంకరరావు, కన్నునాయుడు, సోమునాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు దీక్ష ముగుస్తుంది. శుక్రవారం రాత్రి దీక్షాధారులు శిబిరంలోనే నిద్రించారు.

వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్తగా ధర్మశ్రీ



అచ్యుతాపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తగా కరణం ధర్మశ్రీని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా కరణం ధర్మశ్రీ సాక్షితో మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని, అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు.

సంక్షేమంతో ప్రభుత్వంపై భారం

- తల్లిదండ్రులు పిల్లల్ని కనడమే కాదు వారి విద్యపై శ్రద్ధ చూపాలి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడి, అభివృద్ధి కుంటుపడి భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. వ్యవసాయ యంత్రీకరణ ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 8లో

కూటమి పాలనలో బిచ్చమెత్తుకోవలసిందే..

- కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ఆందోళన
- తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నినాదాలు
- లోకేష్ డౌన్‌డౌన్ అంటూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థుల నిరసన


కలెక్టరేట్ వద్ద భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తుమ్మపాల: విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తామన్నారు.. ఎన్నెన్నో హామీలు ఇచ్చారు.. తీరా అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని తూట్లు పొడుస్తున్నారంటూ కూటమి ప్రభుత్వం తీరుపై విద్యార్థులు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సక్రమంగా ఇవ్వడం లేదని, ఇలా అయితే తమకు భిక్షాటన తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాలలతోపాటు నారాయణ, శ్రీచైతన్య సహా పలు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నారా లోకేష్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పూర్తిస్థాయిలో విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉంచుకుంటున్నారని, చదువు పూర్తయిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చినా సర్టిఫికెట్లు లేక తీవ్రంగా బాధపడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ, కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందించాల్సిన రూ.6400 కోట్లు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని, జీవో నెం.77 రద్దు చేయాలని, డిగ్రీ ప్రవేశాలు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని, అవసరమైతే 'చలో అమరావతి'కి పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, శ్రీచైతన్య, శ్రీకన్య, యలమంచిలి, తుని, పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ రాలేదు



నేను పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో చదువుతున్నాను. మాది పేద కుటుంబం. రెండళ్లతో పూర్తయ్యే ఐటీఐ చదివితే కంపెనీల్లో ఉద్యోగం వస్తుందనే ఆశతో ఉన్నాను. స్కాలర్‌షిప్ వస్తుందని ఏడాది నుంచి ఎదురు చూస్తున్నా ప్రభుత్వం చెల్లించడం లేదు. ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం కూడా ఇవ్వలేదు.

–వాసుపల్లి రాజేష్, పాయకరావుపేట

'తల్లికి వందనం' ఇవ్వలేదు



మాది పేద కుటుంబం. నేను యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చేస్తున్నాను. తల్లికి వందనం డబ్బులతో పుస్తకాలు కొనుక్కోవాలని చూస్తే పథకమే రాలేదు. అనర్హుల జాబితాలో మా పేరు చేర్చారు. రకరకాల కారణాలు చెబుతూ పథకం రాకుండా చేశారు.

–మైలపల్లి శ్యామ్, యలమంచిలి

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక(గెస్ట్ లెక్చరర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మజ్జి ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్దిలపాలెంలోని డా.వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అగనంపూడి, ఇస్లాంపేట, పెందుర్తి కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన విశ్రాంత అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు, కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన ఫ్రెషర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు, ధ్రువపత్రాలను పిఠాపురం కాలనీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఉన్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటల్లోగా సమర్పించాలి. వివరాలకు 0891–2713791 నంబర్ సంప్రదించవచ్చని వృత్తి విద్యాశాఖాధికారి తెలిపారు. భౌతికశాస్త్రం–1, జంతుశాస్త్రం–1, వృక్షశాస్త్రం–1, ఫిజియోథెరపీ–1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రొటోకాల్‌కు విరుద్ధంగా వేదికపై కార్పొరేషన్ చైర్మన్లు



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పీలా గోవింద్

అనకాపల్లి టౌన్: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన 17వ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాములు వేదికపై కూర్చున్నారు. అనుకోని అతిథులను వేదికపై చూడడంతో మండల పరిషత్ అధికారులు అవాక్కయ్యారు. వెంటనే తేరుకున్నా ఏమీ చేయలేక మౌనంగా ఉండిపోయారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగిన ప్రశ్నలకు ఎంపీపీ బదులు చెప్పేలోపే పీలా గోవింద్ తనదైన శైలిలో బదులిచ్చేవారు. వాస్తవానికి ప్రజల నుంచి ఎన్నికైన సభ్యులు మాత్రమే వేదికపై కూర్చోవాలి. కానీ అందుకు విరుద్ధంగా కూటమి నాయకులు అధికార బలంతో సమావేశ వేదికపై కూర్చోవడంతో చివరిలో వారికి సన్మానాలు కూడా చేసి గౌరవించారు.

పట్టుబడింది రేషన్ బియ్యమే

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి న్యూ వెంకటేశ్వరా రైస్ మిల్లులో గురువారం తెల్లవారుజామున యలమంచిలి రూరల్ పోలీసులు స్వాధీనపర్చుకున్న 15 టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన సరకుగా నిర్ధారణ అయింది. తెరువుపల్లి నుంచి కాకినాడ పోర్టుకు వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు వాహనాన్ని, ఇద్దరు వ్యక్తులను స్వాధీనపర్చుకున్న సంగతి తెల్సిందే.ఈ విషయాన్ని నిబంధనల ప్రకారం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా ర్యాండమ్‌గా మూడు శాంపిళ్లను జిల్లా పౌరసరఫరాల అధికారికి గురువారం పంపించారు. వ్యాన్‌లో ఉన్న సుమారు 300 బస్తాల్లో ఉన్నదంతా పీడీఎస్ బియ్యంగా పరీక్షల్లో నిర్ధారించారు. దీంతో శుక్రవారం సాయంత్రం వ్యాన్‌తో సహా బియ్యం లోడును లైనుకొత్తూరులో పౌరసరఫరాల గోడౌన్‌కు పంపించారు.

హోంమంత్రి ఇలాకాలో ఆగని ఇసుక దందా!

- వరాహ నదిలో యథేచ్ఛగా తవ్వకాలు
- తోటల్లో నిల్వ చేసి, అక్రమ రవాణా



గొట్టివాడలోని తోటలో ఇసుక అక్రమ నిల్వలు



కోటవురట్ల: హోంమంత్రి అనిత సొంత నియోజకవర్గంలో ఇసుక దోపిడీ ఆగడం లేదు. కొంత కాలంగా నిశ్శబ్దంగా ఉన్న వరాహ నది మళ్లీ ఘోషిస్తోంది. ఇసుక దొంగలు మళ్లీ రెచ్చిపోతున్నారు. అడ్డదారిలో అక్రమ సంపాదనకు అలవాటు పడిన ఇసుక మాఫియా మళ్లీ చేతివాటం చూపిస్తోంది. మండలంలో వరహనదిలో ఇసుక చోరీకి గురవుతోంది. వాస్తవానికి నదిలో తవ్వకాలకు సరిపడినంత ఇసుక అందుబాటులో లేదు. ఇంతకు మించి తవ్వకాలు జరిపితే భూగర్భ జలాలు అడుగంటి సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. వ్యవసాయ మోటార్లు మూలకు చేరే అవకాశం ఉంది. ఇవన్నీ పట్టని ఇసుక దొంగలు డబ్బే లక్ష్యంగా దోపిడీకి తెర దీశారు. మండలంలోని గొట్టివాడ, పందూరు, కైలాసపట్నం పరిధిలోని వరాహనదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో పందూరు ప్రాంతంలో ఇసుక వేలం నిర్వహించి మూడు నెలల పాటు ఇసుక తవ్వకాలు జరిపారు. గొట్టివాడలో ఓ టీడీపీ నేత తన పలుకుబడిని ఉపయోగించి ఏకధాటిగా నాలుగు నెలల పాటు ఇసుకను దోచేశాడు. ఈ నాలుగు నెలల్లో సుమారు రూ.కోటి సంపాదించినట్టు ఆ నోటా ఈ నోటా జిల్లా అంతా వ్యాపించింది. ఈ విషయం హోం మంత్రి చెవికి చేరడంతో చెడ్డపేరు వస్తోందని మండల స్థాయి నాయకులపై అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. దాంతో కొంత కాలంగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి.

వారం రోజులుగా షరామామూలు..

మళ్లీ తాజాగా వారం రోజులుగా తవ్వకాలు మొదలైనట్టు తెలుస్తోంది. మరో రూ.కోటి లక్ష్యంగా సదరు నేత రంగంలోకి దిగి ఇసుక వ్యాపారం మళ్లీ మొదలెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. నదిలోని ఇసుకను నాటు బళ్లు, ట్రాక్టర్ల ద్వారా రహస్య స్థావరాలకు తరలించి అక్కడి నుంచి లారీల ద్వారా విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు పంపి విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. గొట్టివాడలో మామిడి తోటలు, కొండ ప్రాంతాలలో ఇసుకను నిల్వ చేసి లారీల ద్వారా కె.వెంకటాపురం మార్గంలో తరలిస్తున్నట్టు సమాచారం. ఇసుక అక్రమ తవ్వకాలపై కూటమిలో లుకలుకలు రావడంతో అధికారులకు ఫిర్యాదు వరకు వెళ్లినట్టు తెలుస్తోంది. గురువారం రాత్రి నదిలో నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకున్నట్టు సమాచారం. అధికారులకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తిరిగి వాటిని విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. కైలాసపట్నం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు కూడా ఇసుకను దోచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. చీకటి పడితే చాలు ట్రాక్టర్లు, నాటు బళ్లను నదిలోకి పంపి ఇసుకను తరలించుకుపోతున్నారు. కైలాసపట్నం పరిధిలో పలు రహస్య ప్రాంతాలలో ఇసుకను నిల్వ చేసి లారీల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత భారీ స్థాయిలో ఇసుక దోపిడీ జరుగుతున్న మైనింగ్ శాఖాధికారుల జాడ లేకపోవడం గమనార్హం. దీనిపై తహసీల్దారు తిరుమలబాబును వివరణ కోరగా.. ఇసుక నిల్వ చేసినట్టు తన దృష్టికి వచ్చిందని, సిబ్బందిని పంపి ఇసుకను సీజ్ చేసేందుకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. నదిలోకి ట్రాక్టర్లు, నాటు బళ్లు దిగకుండా గాడి కొట్టిస్తామన్నారు.

నోటు పుస్తకాలను సకాలంలో సరిదిద్దాలి



టెన్త్ విద్యార్థుల తరగతి గదిలో నోట్ పుస్తకాల కరెక్షన్ పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్



విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేస్తున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్

- ఆర్‌జేడీ విజయ భాస్కర్
- కశింకోట బాలికోన్నత పాఠశాల సందర్శన

కశింకోట: విద్యార్థుల నోట్ పుస్తకాలనుసకాలంలో సరిదిద్ది లోపాలను సరి చేయాలని విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(ఆర్‌జేడీ) విజయ భాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. కశింకోటలోని బాలికోన్నత పాఠశాలను, తేగాడ గ్రామంలోని మోడల్ స్కూల్, కేజీబీవీని జిల్లా విద్యా శాఖ అధికారి జి.అప్పారావునాయుడు, ఉప విద్యా శాఖ అధికారి పి.అప్పారావుతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ చదువుతున్న విద్యార్థుల సెక్షన్‌కు వెళ్లి నోట్ పుస్తకాలు ఉపాధ్యాయులు సవ్యంగా దిద్దారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. గణితం, పీఎస్, ఎన్ఎస్ వంటి పాఠ్యాంశాల నోట్ పుస్తకాలు బాగా సరి దిద్దినప్పటికీ మిగిలిన పాఠ్యాంశాల నోట్ పుస్తకాలను సరిదిద్దకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సిలబస్ ప్రకారం పాఠాలు జరిగాయా? లేదా? అనే విషయాన్ని, విద్యార్థుల చదువు తీరును విద్యార్థులను ప్రశ్నించి పరిశీలించారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు.

మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వస్తే సహించం

అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. భోజనం సరిపడినంత మేర విద్యార్థులకు అందించడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఆర్‌జేడీ హెచ్చరించారు. సరిపడినంతగా సరకులు, బియ్యం సరఫరా కావడం లేదా? అని భోజన పథకం నిర్వాహకులను ప్రశ్నించారు. ఎండీఎం రికార్డులను, స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేసి, ఆహార పదార్థాల రుచి చూశారు.

వారానికి 36 పీరియడ్స్ తప్పనిసరి

అనంతరం ఉపాధ్యాయులతో ఆర్‌జేడీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు వారానికి తప్పనిసరిగా 36 పీరియడ్స్ పాఠ్యాంశాలను బోధించాలన్నారు. పాఠశాలకు ఉదయం 9 గంటలలోగా హాజరు కావాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం ప్రారంభంలోను, ముగిసే సమయంలోను ఆన్‌లైన్ హాజరు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హాజరు ఒకేలా ఉండేలా చూడాలన్నారు. ఎంఈవో కె.ఎస్.ఎన్.మూర్తి, విద్యా కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలి

బడిఈడు పిల్లలను శత శాతం పాఠశాలల్లో చేర్పి చదివేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ విజయ భాస్కర్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యా శాఖ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలు ఎంత మంది ఉన్నారనే విషయమై రికార్డులను పరిశీలించి ఆరా తీశారు. కార్యాలయ పని తీరును పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సురేష్‌కుమార్, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రభుత్వంపై భారం

- ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- మార్కెట్ యార్డులో వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన



యంత్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ప్రజల్లో చైతన్యంతో పాటు మార్పు రాకపోతే ఈ రాష్ట్రాన్ని ఎవరు బాగు చేయలేరని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలు వ్యవసాయ మార్కెట్ యార్డు అవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్రీకరణ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడి, అభివృద్ధి కుంటుపడి భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఏటా రూ.10 వేలు కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఇంత వ్యయం నీటి పారుదలపై చేస్తే సాగు అభివృద్ధి చెందుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను కనడంపై ఎంత శ్రద్ధ చూపుతారో అంతే శ్రద్ధ వారి విద్యపై చూపాలన్నారు. ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాకు 1300 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరైతే, వారిలో 348 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వారిలో 73 మంది మాత్రమే విధుల్లో చేరారని, మరో 77 మంది ఫోన్ ఎత్తలేదన్నారు. మరో 27 మంది తమకు కంపెనీ దూరమైందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. యువత ఆలోచన విధానం ఇలా ఉంటే రాష్ట్ర ఎలా బాగుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల వల్ల అభివృద్ధి ఆగిపోతే అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాదికి నర్సీపట్నం నియోజకవర్గాన్ని వ్యవసాయ రంగంలో ప్రథమ స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. రూ.2 లక్షలు చెల్లిస్తే రూ.10 లక్షలు విలువ చేసే పురుగు మందు స్ప్రే డ్రోన్లు మండలానికి రెండు చొప్పున మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, ఆర్డీవో వి.వి.రమణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రావు, కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, జెడ్పీటీసీ సుకల రమణ, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో ఆకర్షణీయంగా రుణాలు



రైతులకు రుణాల చెక్కును అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ తాతారావు, సీఈవోలు

ఎస్.రాయవరం: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉమ్మడి విశాఖ జిల్లా చైర్మన్ కోన తాతరావు అన్నారు. అడ్డురోడ్డు డీసీసీబీ బ్యాంకులో స్వయం సహాయక సంఘాలకు రూ.5.03 కోట్ల రుణాలను శుక్రవారం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ జాతీయ బ్యాంకులు కన్నా మెరుగైన సేవలు అందించాలన్న సదుద్దేశంతో డీసీసీబీ పని చేస్తుందన్నారు. రైతులు ఏ పంట వేసినా రుణాలు అందజేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ మాట్లాడుతూ రూ.2400 కోట్ల రుణాల టర్నోవర్‌తో రూ.2 కోట్ల లాభంతో బ్యాంకు సేవలు అందిస్తుందన్నారు. ఇటీవల నియమితులైన పీఏసీఎస్ చైర్ పర్సన్లు గుర్రం వెంకటరామకృష్ణ, గెడ్డం కన్నబాబు, వెలగా శ్రీనివాసరావు, రెడ్డి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అహీర్ రెజిమెంట్ ఏర్పాటు కోసం యాత్ర



అహీర్ రెజిమెంట్ ఏర్పాటు కోరుతూ కె.కోటపాడు నుంచి సాగుతున్న ర్యాలీ

కె.కోటపాడు : భారత సైన్యంలో అహీర్(యాదవ) రెజిమెంట్‌ను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో అఖిత భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో రెజంగలా పవిత్ర కలశ యాత్రను నిర్వహిస్తున్నట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.మహేశ్వరియాదవ్ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 13న బిహార్‌లో ప్రారంభమైన ఈ యాత్ర కె.కోటపాడు మీదుగా అనకాపల్లి వైపు శుక్రవారం సాగింది. అఖిల భారత ఉత్తరాంధ్ర జోన్ కన్వీనర్ పల్లా రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో కె.కోటపాడులో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మహేశ్వరియాదవ్ మాట్లాడుతూ 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో 120 మంది అహీర్ వీర సైనికులు పోరాటం చేసి లడక్ చుగుల్ హైర్ పీల్డును కాపాడారన్నారు. ఈ యుద్ధంలో 114 మంది అహీర్ వీరులు(యాదవ) వీర మరణం పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయమూర్తి యాదవ్, బొట్టా రామారావు, దూళి రంగనాయకులు యాదవ్, మునిస్వామి యాదవ్, షేషపాణి యాదవ్, పల్లా రామమూర్తి పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్



గంజాయి నిందితులతో పట్టణ సీఐ విజయకుమార్

అనకాపల్లిటౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి రైలు మార్గంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావుకు అందిన సమాచారం మేరకు అనకాపల్లి రైల్వే స్టేషన్ గూడ్స్ రోడ్ జంక్షన్ వద్ద ఇద్దరూ అనుమానితుల్ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మూడు బ్యాగులను తనిఖీ చేయగా 12 కిలోల గంజాయి బయటపడింది. ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలో విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు సీఐ చెప్పారు. ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి



పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు

నక్కపల్లి: మండలంలో అమలాపురం శివారు పాటిమీద కొబ్బరితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాటిమీద సమీపంలో పలువురు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి దాడులు చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని, రూ 1.23 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

పింఛనుదార్ల ఇబ్బందులు తొలగిస్తాం

- ఖజానా శాఖ రాష్ట్ర డైరెక్టర్ మోహన్‌రావు



రాష్ట్ర ఖజానాశాఖ డైరెక్టర్ మోహన్‌రావును శాలువాతో సత్కరిస్తున్న ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం జిల్లా సభ్యులు

అనకాపల్లి: జిల్లా ఖజానా శాఖా కార్యాలయాన్ని ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.మోహన్‌రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పే బిల్‌లో సీఎఫ్ఎంఎస్ ప్రతి మూడు నెలలకు పాస్‌వర్డ్ మార్పు చేయడం వలన పింఛనుదారులు ఇబ్బంది పడుతున్నారని, ఆరు మాసాలకు మార్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. కుటుంబ పింఛను పొందుతున్న వారిలో భార్య జనన తేదీ మార్పు విషయంలో ఇబ్బందులను పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం జిల్లా బ్రాంచి అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు, కార్యదర్శి బి.ఎల్.ఎస్.శర్మలు శాలువాలతో ఎస్.మోహనరావును సత్కరించారు. జిల్లా ఖజానాధికారి వి.ఎల్.సుభాషిణి, సంఘం కోశాధికారి కె.సత్యారావు, విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.గౌరీపతి తదితరులు పాల్గొన్నారు.

దళిత భూముల కేసులో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులకు ఊరట

- కేసును కొట్టేసిన కోర్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు

చోడవరం: దళిత భూముల వివాదం కేసులో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులకు కోర్టులో ఊరట కలిగింది. ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను కొట్టేస్తూ చోడవరం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూర్యకళ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే...కె.కోటపాడు మండలం కె.సంతపాలెం గ్రామంలో 1970లో దళితులకు ఇచ్చిన 18 ఎకరాల అసైన్డ్ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకోవడంతో బాధిత దళితులకు న్యాయం చేయాలంటూ 2018లో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు అప్పటి తహసీల్దార్‌ను ప్రశ్నించడంతో కేసు నమోదు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్నతోపాటు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు, సిఐటియు మండల కార్యదర్శి జి.తాతాలు, ఈర్లె నాయుడుబాబులతోపాటు స్థానికులు నిమిడి తల్లి సింహాచలం, ఏగాటి లింగరాజులపై 352 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వాదనలు పూర్తికావడంతో ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన కేసులను కొట్టివేస్తూ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పారని న్యాయవాదులు సీతా వెంకటరావు, గండి నాయన్ బాబు, గాడి ప్రసాద్ తెలిపారు.

ధర్మశ్రీకి అభినందనలు



ధర్మశ్రీని అభినందిస్తున్న అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీలు

చోడవరం: ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ధర్మశ్రీని పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విశాఖలో శుక్రవారం అభినందించారు. రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, అనకాపల్లి పార్లమెంటు పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, పలువురు జెడ్పీటీసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన ఏసుబాబు

నక్కపల్లి: జాతీయ రహదారిపై వెతుళ్లపాలెం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. కాకినాడ జిల్లా గోకవరానికి చెందిన మందపాటి ఏసుబాబు(42) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విశాఖపట్నం వెళ్తూ వెదుళపాలెం వద్ద లారీ ఆపి భోజనం చేసేందుకు హోటల్‌కి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సారా కేసుల్లో నిందితుడికి 12 నెలల నిర్బంధం

పాయకరావుపేట: పలు సారా కేసుల్లో నిందితుడిగా ఉన్న మంగవరం గ్రామానికి చెందిన యాండ్ర సత్తిబాబు (32)ను 12 నెలలపాటు నిర్బంధించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సత్తిబాబును గత నెల 4వ తేదీన స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు పీడీ యాక్ట్ ప్రకారం అరెస్టు చేసి విశాఖపట్నం జిల్లా కారాగారానికి పంపించారు. అనంతరం ఈ కేసు పై విచారణ జరిపిన సలహా మండలి సిఫార్సు మేరకు నిందితుడు అక్రమంగా సారా సరఫరా చేస్తూ, ఇలాంటి నేరాలకు తరచు పాల్పడుతున్నందున 12 నెలలపాటు నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి రవాణాపై మరింత నిఘా

- ఎస్పీ తుహిన్ సిన్హా



శ్రీరాంపురం సమీపంలో చెక్ పోస్టు సిబ్బందిని ఆరా తీస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

దేవరాపల్లి/కె.కోటపాడు: గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిఘాను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసులకు సూచించారు. దేవరాపల్లి పోలీస్‌స్టేషన్‌ను, కె.కోటపాడు మండలం ఎ.కోడూరు స్టేషన్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై ఆరా తీశారు. 2025లో నమోదైన రెండు హత్య కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ పి.పైడిపునాయుడు, ఎస్ఐ టి.మల్లేశ్వరరావులకు సూచించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంపిణీ చేసి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శ్రీరాంపురం వై జంక్షన్ సమీపంలోనే పోలీస్ చెక్‌పోస్టును పరిశీలించారు. నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషించే సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ ఈ సందర్భంగా స్థానిక విలేకర్లకు చెప్పారు. జిల్లాలో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటి వరకు సిఎస్ఆర్ నిధులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతో ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారుల్లో 2500 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై ఆసక్తి

- పెరుగుతున్న ప్రకృతి సేద్య విస్తీర్ణం
- ఘన, ద్రవ జీవామృతాలే ప్రకృతి ఎరువులు
- మండలంలో 2,457 ఎకరాల్లో సాగు

తుమ్మపాల: రసాయనాలతో పండించిన పంటలతో అనారోగ్యాలు వస్తుండటంతో ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు వచ్చింది. పర్యవసానంగా సేంద్రియ ఆహార పదార్థాలపై దృష్టి సారిస్తున్నారు. మార్కెట్లో వీటికి డిమాండ్ పెరగడంతో రైతులు సైతం ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి మండలంలో ప్రకృతి వ్యవసాయం జోరందుకుంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి ప్రకృతి వ్యవసాయం ఉపయోగకరంగా ఉండటంతో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. ప్రకృతి సేద్యం వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రస్తుతం మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతుంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతోపాటు ఇతర రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తున్నారు. తుమ్మపాల, సీతానగరం, వెంకుపాలెం, ఊడేరు బవులువాడ, దిబ్బపాలెం, తగరంపూడి, జగన్నాథపురం పలు ప్రాంతాల్లో దాదాపు 2,457 ఎకరాల మేర సాగు చేస్తున్నారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే. ఆకుకూరలు, కూరగాయలు, మామిడి, జీడిమామిడి, వరి పంటలతోపాటు మినుములు, చోళ్లు, వంటి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

సహజ ఎరువుల వినియోగం

సేంద్రియ విధానంలో పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి నిలిపారు. పూతపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడడానికి ఆవు పేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారు చేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడపీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గితెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారు చేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో రైతులకు శిక్షణ ఇవ్వడంతో కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

మార్కెట్ విస్తరణతో ఆసక్తి

ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి తెలుసుకుని, ఇతర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మార్కెట్ లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, సిబ్బంది. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించి సాగుకు ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు.




మహిళా రైతులతో ఘన జీవామృతం తయారు చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

భూములు సారవంతం



ప్రకృతి వ్యవసాయంలో రసాయన ఎరువులు లేకుండా సాంప్రదాయ ఘన, ద్రవ జీవామృతాలే ఎరువులుగా వినియోగించడం వల్లన లభించే ఉత్పత్తులు ఆరోగ్యకరమైనవి. ఈ సాగులో భూములు కూడా సారవంతమవుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయలు సాగుచేస్తున్నాం. పట్టణ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా వచ్చి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగుతో ఆశించిన రాబడి వస్తుంది.

– జి.రాము, రైతు, శంకరం గ్రామం

2,500 ఎకరాల్లో ప్రకృతి సాగు

ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రైతుల కల్లాల్లోనే ఘన, జీవామృతాల తయారీపై రైతులకు శిక్షణ ఇస్తూ అవగాహన చేస్తున్నాం. తక్కువ ఖర్చుతోపాటు మంచి దిగుబడులు రావడంతో రైతులకు వివరించి పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగడం వల్ల గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– జి.సత్యారావు, సీఆర్పీ, ప్రకృతి వ్యవసాయం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అష్టోత్తర కలశ పూజలు



108 కలశాలతో పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం స్వామివారికి సుప్రభాత సేవ, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, హోమం నిర్వహించారు. బేడసేవ మండపంలో లోకోత్తర సహస్ర కలశాలతో, 108 కలశాలతో అష్టోత్తర పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పూలఖండం గిరిబాబు, విజయబాబు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం రాజేష్, ప్రసాద్, ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో మురళీకృష్ణ, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

కశింకోట: మండల స్థాయి సమన్వయ కమిటీ దృష్టికి భూ సమస్యల పరిష్కారం కోసం మూడు ఫిర్యాదులు అందాయి. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. వీటిలో ఒక సమస్యను పరిష్కరించగా, మిగిలిన రెండు ఫిర్యాదుల పరిష్కారాన్ని వాయిదా వేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఎంపీడీవో వి.వి.రవి కుమార్, ఎస్ఐ కె. లక్ష్మణరావు, ఉప తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీడీవో వి.వి.రవి కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ వీధుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలు తడి, పొడి చెత్త తెచ్చి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ముగిసిన ఏకాహ భజన

కశింకోట: స్థానిక గవరపేటలోని ఆశ్రమంలో హరి నామ స్మరణతో నిర్వహించిన ఏకాహం భజన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. గురుపౌర్ణమి పురస్కరించుకొని జరిగిన కార్యక్రమం అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 22 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	4,150	4,150
మూడోరకం	3,150	3,150

అనకాపల్లి సినిమాలు

రాజా	: సూపర్ మన్
సత్యనారాయణ స్క్రీన్-1	: కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్-2	: జురాసిక్ వరల్డ్ 3డి వెర్షన్ తెలుగు
పర్తిసాయి	: ఓ భామ అయ్యో రామ
షిర్డీసాయి	: తమ్ముడు
వెంకటేశ్వర	: వర్జిన్ బాయ్స్
శ్రీ సత్య	: ది 100
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10, బీ పాజిటివ్-4, ఓ పాజిటివ్-11, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 331 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

పాలసీపై జీఎస్టీని తొలగించాలి



మాట్లాడుతున్న ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు

అనకాపల్లి టౌన్: పాలసీదారుని పాలసీపై వేస్తున్న జీఎస్టీని తొలగించాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ డివిజన్ అధ్యక్షుడు ఎం నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం స్థానిక బ్రాంచ్ అధ్యక్షుడు అధ్యక్షతన ఈసీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా సుగమ్ అనే పేరుతో గతంలో ఏజెంట్స్‌కు వ్యతిరేకంగా ఒక ప్రతిపాదన తేవడంతో ఆందోళన చేపట్టామన్నారు. దీంతో యాజమాన్యం వెనక్కు తగ్గి పేరు మార్పు చేసి మరలా మరొక పేరుతో బీమా సుగమ్‌ను తీసుకువచ్చే కుట్రలు చేస్తుందన్నారు. క్లా బ్యాక్ అంశం మీద ఏజెంట్స్ నిరంతర పోరాటం చేయాలన్నారు. ఏజెంట్స్‌కు గ్రూప్ ఇన్సూరెన్స్, మెడిక్లెయిమ్ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి త్రిమూర్తులు, యూనియన్ రూరల్ అధ్యక్షుడు రమణబాబు, ఈశ్వరరావు, గొర్లి శంకర్రావు, కరణం మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

కశింకోట: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇద్దరికి మంజూరైన రూ.80 వేల సహాయాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అందజేశారు. పల్లపోతుల ప్రియాంకకు రూ.60 వేలు, భీశెట్టి అప్పలరాజుకు రూ.20 వేలు వంతున చెక్కుల రూపంలో అందించారు. మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

15న మున్సిపల్ కార్మికుల ఆందోళన

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ సంఘం నాయకులు

తుమ్మపాల: మున్సిపల్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లింపుతోపాటు, గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, 12వ పీఆర్సీ ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల హామీల ప్రకారం కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను, రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ వెంటనే విడుదల చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే, మరోపక్క కూటమి ప్రభుత్వం వారి పని గంటలు పెంచి పరోక్షంగా వేతనాలు కుదించేందుకు మంత్రివర్గ సమావేశంలో తీర్మానాలు చేయడం తగదన్నారు. ఇంజనీరింగ్ పార్క్ కూలీలకు ఆఫీస్ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా రూ.21 వేలు, రూ.24,500 వేతనాలు అందివ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటైర్‌మెంట్, మరణించిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి పనులు కల్పించాలన్నారు.

డైలీ వేజ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఆప్కోస్‌లో కలిపి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హామీలు అమలు కాని క్రమంలో ఈ నెల 15న విజయవాడలో తలపెట్టిన ఆందోళనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నిమ్మకాల నర్సింహామూర్తి, బంగారు రవికుమార్, సింగంపల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి-2, 11 కేవీ గవరపాలెం ఫీడర్ పరిధిలో ఈ నెల 13న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల ఉంటుందన్నారు. రాఘురామ్ కాలనీ, సర్వేపల్లి కాలేజీ రహదారి, వైజాగ్ రోడ్డు, జాతీయ రహదారి డైట్ కళాశాల, జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక బ్రిడ్జి వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొగాకు తాగితే వ్యాధులు



ర్యాలీని నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు

అనకాపల్లి: పొగాకు తాగడం వల్ల వివిధ రకాల వ్యాధులు బారినపడే అవకాశాలు ఉన్నాయని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి నుంచి నెహ్రూచౌక్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు సేవించిన వారి కంటే పొగను పీల్చిన వ్యక్తులు కూడా వ్యాధులు బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్తేరు రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



కశింకోటలో వైద్య సిబ్బంది ర్యాలీ

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చినబాబు కాలనీలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మపాల వైద్యాధికారి ఆర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం కలిగి ఉండాలన్నారు. తల్లి కావడానికి సరైన వయసు మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి. మంగమ్మ, ఎం. మరియమ్మ, చంద్రశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు తిరుపతిరావు, యశోదల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణకు తాత్కాలిక, శాశ్వత పద్ధతులు పాటించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ పాదయాత్రకు స్వాగతం



మహాసభ అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్‌ను సత్కరిస్తున్న పట్టణ యాదవ సంఘం నాయకులు

అనకాపల్లి: అఖిల భారత యాదవ పాదయాత్ర పట్టణంలోని గాంధీనగరం వద్దకు శుక్రవారం చేరుకుంది. అక్కడ నుంచి నెహ్రూచౌక్ మీదుగా యలమంచిలి వెళ్లింది. తొలుత పాదయాత్రకు జిల్లా రెజెంగ్లా కోఆర్డినేటర్ బోయిన భానుమూర్తి యాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షురాలు ఎస్ మహేశ్వరి యాదవ్ మాట్లాడుతూ 1962 యుద్ధంలో లడఖ్ ప్రాంతాన్ని చైనా ఆక్రమించడాన్ని నిరోధిస్తూ అహిర్ (యాదవ్) రెజిమెంట్ 120 మంది సైనికులు 3,500 మంది చైనా సైనికులతో పోరాడారన్నారు. వీరిలో 1,310 మందిపైగా చైనా సైనికులను మట్టిబెట్టారని పేర్కొన్నారు. ఈ యుద్ధంలో 114 మంది అహిర్ (యాదవ్) రెజిమెంట్ సైనికులు చనిపోయారన్నారు. అమరువీరులు నేలకు ఒరిగిన ప్రాంతంలో సేకరించిన మట్టితో బీహార్ రాష్ట్రం చారిత్రక ప్రాంతమైన చాప్ర నుంచి పాదయాత్ర మొదలైందన్నారు. దాదాపుగా లక్ష కిలోమీటర్లు పవిత్ర కలశ యాత్ర సాగుతుందని, నవంబర్ 18న ఢిల్లీలో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి దొడ్డక ఆంజనేయ మూర్తి, మహిళా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లీశ్వరి యాదవ్, కలశ యాత్ర కన్వీనర్ బంకా దత్తాత్రేయ యాదవ్, ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి పల్లా రాజేశ్వరరావు యాదవ్, కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో రైతుల పేర్లు తొలగింపు

మండల సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సభ్యులు

అనకాపల్లి టౌన్: 17వ మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ప్రధానంగా అన్నదాత సుఖీభవ పథకం జాబితాల్లో చాలామంది రైతుల పేర్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులు ఇచ్చేవారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పది సెంట్లు తక్కువ ఉన్న రైతుల పేర్లు అన్నదాత సుఖీభవ జాబితాలో తొలగించారని అధికారులను నిలదీశారు. మండలంలోని గత ప్రభుత్వంలో 15,500 మందికి రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తే, ఈ ఏడాది 2,500 మందికి పైగా పేర్లు జాబితాలో లేవన్నారు. దీనిపై ఎంపీపీ బదులిస్తూ తక్షణమే సమస్యను పరిష్కరించాలని తీర్మానం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ కౌలు రైతు కార్డులు అందజేస్తామన్నారు. గొలగాం ఎంపీటీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిని అయిన తన పేరే జాబితాలో లేదని వాపోయారు. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మరికొంత మంది సర్పంచ్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో మొదలు పెట్టిన నాడు–నేడు స్కూళ్ల పనులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చాలా గ్రామాల్లో చివరి దశకు వచ్చిన బిల్డింగ్‌లు ఉన్నాయని, వాటిని వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే వాటిని పూర్తి చేసేలా తీర్మానం చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పూర్తిగా తగ్గిపోతున్నాయని వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. తన గ్రామ పాఠశాలలో గత ఏడాది కంటే ఈ ఏడాది 30 మంది విద్యార్థులు తక్కువగా ఉన్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ తుమ్మపాలలో ప్లే గ్రౌండ్, జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వెంకటసత్యవతి, వైస్ ఎంపీపీ ఆనందరామ్, ఎంపీడీవో ఆశాజ్యోతి, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో ఆర్టీసీ సేవలు ప్రశంసనీయం



ఉద్యోగుల అభినందన సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

సింహాచలం: గిరి ప్రదక్షిణలో భక్తులను వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ అత్యుత్తమ సేవలందించిందని సంస్థ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. గిరిప్రదక్షిణలో అత్యుత్తమ సేవలందించిన ఉద్యోగుల అభినందన సభ సింహాచలం ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ సింహాచలం కొండ పైనుంచి దిగువకు 55 బస్సులు షటిల్ సర్వీసులుగా నడిపామని, నగర వ్యాప్తంగా 150 బస్సులు తిప్పినట్లు పేర్కొన్నారు. ఉత్తమ సేవలందించిన సింహాచలం డిపో కండక్టర్లు ఎల్‌పి కుమార్, కేఎస్ రాజు, డ్రైవర్లు ఆర్ఆర్ నాయుడు, ఎంఈ రావు, సీహెచ్ నాయుడులను అభినందించారు. డిపో మేనేజర్ శరత్, అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నారుమడికి పైపాటుగా యూరియా వాడకం

అనకాపల్లి: ఐదు సెంట్ల వరి నారుమడి వేసిన 12–14 రోజులకు పైపాటుగా 2.5 కిలోల యూరియా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారుమడి వేసిన 15 నుంచి 20 రోజులకు సెంటుకు 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలి. రాగల ఐదు రోజులు అధిక ఉష్ణోగ్రతలు, తేలికపాటి జల్లులు ఉండే అవకాశం ఉన్నందున అవసరానికి మేరకు నీటి తడులు ఇవ్వాలి. నేరుగా వరి విత్తే పద్ధతిలో కలుప సమస్య అధికంగా ఉంటుంది. 20 రోజుల వరి పైరులో గడ్డి, వెడల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు, బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లీల చొప్పున పిచికారీ చేయాలి. గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫైనోక్సాప్రోప్ పి ఇథైల్‌ను 350 మి.లీల చొప్పున ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. పదును చూసుకుని మొదటి దఫా యురియా ఎకరాకు 25 కిలోల చొప్పున విత్తిన 15 నుంచి 20 రోజులకు వేసుకోవాలి. మొక్కజొన్నలో అధిక దిగుబడినిచ్చే రకాలను కాని హైబ్రీడ్లను కాని వేసుకోవాలి. 30 రోజుల వయసు గల సజ్జ పైరులో 35 కిలోల యురియాను పైపాటుగా వేసుకోవాలి. కాయ తొలుచు పురుగు నివారణకు క్లొరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో నువ్వు పైరులో రసంపీల్చు పురుగులు ఆశించి వెర్రి తెగులును వ్యాప్తి చేసే అవకాశం ఉందని, నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీటి ఎద్దడి లేకుండా తేలికపాటి తడి ఇవ్వాలి. చెరకులో ఆకు తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగులు పెరిగే అవకాశం ఉన్నందున్న డైమిథోయేట్ 2 మీ. లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అసకపల్లిలో ఆక్రమణల తొలగింపు



అక్రమ నిర్మాణ తొలగింపులో రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అసకపల్లిలో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. రెవెన్యూ పరిధి సర్వే నెం.1లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదు మేరకు తొలగింపు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భూ కబ్జా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ వీరయ్య, వీర్వోలు ఉన్నారు.

ప్రభుత్వం దృష్టికి రైతుల డిమాండ్లు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి

కశింకోట: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసిత రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తెలిపారు. మండలంలోని ఉగ్గినపాలెంలో సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములు కోల్పోయే రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. భూసేకరణకు ధర విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరాకు మార్కెట్ ధర ప్రకారం రూ.45 లక్షలు ఉంటుందని అంచనా అన్నారు. దీనికి రెండున్నర రెట్లు వంతున భూమి కోల్పోయే వారికి ప్రభుత్వం పరిహారం అందించడానికి అవకాశం ఉందన్నారు. అయితే రైతులు దీన్ని మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతుల సమక్షంలో భూముల సర్వే చేసి హద్దులు నిర్ణయించిన తర్వాత వారితో మళ్లీ సమావేశమై అనంతరం భూసేకరణ చేపడతామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ మండల నాయకుడు కలగా సోమేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- మొగలిపురం పర్యటనలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



పారిశుధ్య నిర్వహణపై గ్రామస్తులు, అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత కావాలని జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మొగలిపురంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై అధికారులను ఆరా తీశారు. రక్షిత మంచినీటి పథకం, డ్రైన్ల నిర్వహణ, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం, నిలిచిన జల్ జీవన్ మిషన్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి అభివృద్ధి పనులను సమీక్షిస్తూ, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్డీ డి.చైతన్య పాల్గొన్నారు.